అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి మంజుల సూర్యవర్

వస్తువులు గడువులోపు చెడిపోతే పరిహారం పొందవచ్చు

● సీనియర్ సివిల్ జడ్జి మంజుల సూర్యవర్

నకిరేకల్, మార్చి 15 : ఆస్పత్రి మందులు, ఎలక్ట్రానిక్ వస్తువులు గడువు లోపల చెడిపోతే నష్ట పరిహారం పొందవచ్చని సీనియర్ సివిల్ జడ్జి మంజుల సూర్యవర్ అన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం తాటికల్ గ్రామపంచాయతీ ఆవరణలో మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని వినియోగదారులకు పలు అంశాలపై అవగాహనా కల్పించారు. బాల్య వివాహాలు, సీనియర్ సిటిజన్ యాక్ట్, సైబర్ క్రైమ్స్, మోటార్ డ్రైవింగ్ యాక్ట్‌పై వివరించారు. ఒక కేసులో ఆర్టీసీ బస్సు డోర్‌కు ఉన్న మేకు తగిలి చీర చిరిగిపోతే ఆర్టీసీ నుంచి నష్టపరిహారం పొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు ప్రకాశ్‌రావు, కొండ యాదగిరి, విజయ్‌కుమార్, చౌగోని నాగరాజు, మంగ సైదులు, వెంకన్న, సుజాత, పారా లీగల్ వాలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు సహకరించాలి

● అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ, మార్చి 15: పారదర్శకమైన ఫొటో ఓటరు జాబితా తయారీలో భాగంగా నిరంతర మార్పులు, చేర్పుల విషయంలో రాజకీయ పార్టీలు సహకరించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఫొటో ఓటరు జాబితాలో మార్పుల నేపథ్యంలో ఆయన శనివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో 1812 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, రాజకీయ పార్టీల ప్రతినిధులు బూత్‌స్థాయిలో తమ ఏజెంట్లను నియమిస్తే తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయవచ్చన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫామ్ 6,7,8ను ఈ నెల 21లోపు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో అశోక్, పిచ్చయ్య, లింగస్వామి, నర్సిరెడ్డి, రజీయొద్దీన్, హన్సి, డీఆర్వో అశోక్ రెడ్డి పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్లపై అవగాహన కల్పించాలి

రాష్ట్ర ప్రభుత్వం ఇండ్లు లేనివారికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్న విషయాన్ని అందరికీ అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సూచించారు. శనివారం తన చాంబర్లో హౌసింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వం ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు ఇస్తున్నందున ఆ డబ్బులు సద్వినియోగం అయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో హౌసింగ్ పీడీ రాజ్‌కుమార్, అధికారులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో టాటా ఏస్ వాహనం దగ్ధం

కట్టంగూర్, మార్చి 15 : షార్ట్ సర్క్యూట్‌తో టాటా ఏస్ వాహనం దగ్ధమైన ఘటన శనివారం కట్టంగూర్‌లోని కురుమర్తి రోడ్డులో చోటు చేసుకొంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. కురుమర్తి గ్రామంలో గేదెలను లోడ్ చేసుకొని వచ్చేందుకు కట్టంగూర్‌కు చెందిన ఏనుగు కృష్ణ తన టాటా ఏస్ వాహనంతో బయల్దేరాడు. సత్యనారాయణపురం సమీపంలోకి రాగానే ఒక్కసారిగా ఇంజిన్‌లోంచి మంటలు చెలరేగాయి. గమనించిన కృష్ణ వెంటనే వాహనం దిగి, ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించాడు. చూస్తుండగానే మంటలు ఎగసిపడడంతో వాహనం పూర్తిగా దగ్ధమైంది. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేసినా ఫలితం లేకుండా పోయింది. అప్పుచేసి వాహనం కొనుగోలు చేశానని, పూర్తిగా కాలిపోవడంతో ఉపాధి లేకుండా పోయిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

దగ్ధమవుతున్న టాటా ఏస్ వాహనాన్ని ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

రైతులకు పరిహారం చెల్లించాలి : సీపీఎం

చిట్యాల, మార్చి 15 : సాగునీరందక వరి పంటలు ఎండిపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జిట్ట నగేశ్, అవిశెట్టి శంకరయ్య డిమాండ్ చేశారు. చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలో శనివారం సీపీఎం, రైతు సంఘాల ఆధ్వర్యంలో ఎండిపోయిన వరి పొలాలను పరిశీలించారు. పంటలు ఎండిపోవడంతో రైతులు అప్పుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చిన్నకాపర్తి గ్రామ పంచాయతీ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు కోనేటి రాములు, రూపని ఇద్దయ్య, శిరస్సు హన్మయ్య, వీరమళ్ల వెంకటేశ్వర్లు, దేశపాక సైదులు, రుద్రారపు పార్వతమ్మ, జయమ్మ, గోపమ్మ పాల్గొన్నారు.

వరిపొలాలను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

బీసీ జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించాలి

● బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దీపేందర్

నల్లగొండ రూరల్, మార్చి 15 : బీసీ జనాభా దామాషా ప్రకారం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు అన్యాయం చేస్తే సహించేది లేదని బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19న ప్రవేశ పెట్టే బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి ప్రతి ఆర్థిక సంవత్సరం రూ. 20 వేల కోట్ల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎలిజాల వెంకటేశ్వర్లు, బోళ్ల నాగరాజు, సాయిరాం, అనిల్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దీపేందర్

జగదీశ్‌రెడ్డి సస్పెన్షన్ అసెంబ్లీ చరిత్రలో చీకటి రోజు

● బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నవీన్‌రావు

నకిరేకల్, మార్చి 15 : మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేయడం అసెంబ్లీ చరిత్రలో చీకటి రోజుగా మిగిలి పోతుందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నవీన్‌రావు అన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నుంచి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డిని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ నకిరేకల్ పట్టణంలోని మెయిన్‌సెంటర్‌లో శనివారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశ్నించేవారిని సభ నుంచి బయటికి పంపించడమే పనిగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయక పోవడంపై అసెంబ్లీలో నిలదీస్తుంటే అందుకు భయపడి సస్పెండ్ చేశారని, అయినా ప్రశ్నించడాన్ని బీఆర్ఎస్ ఆపదని స్పష్టం చేశారు. వెంటనే జగదీశ్‌రెడ్డిపై సస్పెన్షన్‌ను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నోముల కేశవరాజు, మాజీ ఎంపీటీసీలు గుర్రం గణేశ్, రాచకొండ వెంకట్, నాయకులు సామ శ్రీనివాస్‌రెడ్డి, దైద పరమేశం, రావిరాల మల్లయ్య, ప్రభాకర్‌రావు, వెంకట్‌రెడ్డి, గొర్ల వీరయ్య, చెట్టుపల్లి జానయ్య, పేర్ల కృష్ణకాంత్, గుండగోని జంగయ్య పాల్గొన్నారు.

నకిరేకల్ మెయిన్ సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు

కంప్యూటర్ తరగతులు ప్రారంభం

చిట్యాల, మార్చి 15 : మండలంలోని నేరడ ప్రాథమిక పాఠశాలలో చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం కంప్యూటర్ ఆధారిత ప్రత్యేక తరగతులను శనివారం ఎంఈఓ సైదానాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ రాబోయే విద్యా సంవత్సరంలో అనుసరించే ప్రణాళికలను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి. రామ్మోహన్, వి.నాగరాజు, కాంప్లెక్స్ హెచ్ఎం జి. మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

30న వివిధ రంగాల నిపుణులకు పురస్కారాలు

రామగిరి, మార్చి 15: తెలుగు నూతన సంవత్సరం ఉగాది విశ్వావసు నామ సంవత్సర వేడుకలు సాహితీ మేఖల సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి పున్న అంజయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా పలు రంగాల్లో నిపుణులను సన్మానిస్తున్నట్లు పేర్కొన్నారు.

17న దర్వేశిపురం వద్ద దుకాణాలకు టెండర్లు

నల్లగొండ సిటీ, మార్చి 15 : కనగల్ మండలం దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద పలు దుకాణాల నిర్వహణకు ఈ నెల 17న టెండర్లు నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తలనీలాల సేకరణ, కొబ్బరి చిప్పల సేకరణ, వాహనాలకు బొట్టుపెట్టడం, చీరలు ఒడి బియ్యం సేకరణకు మధ్యాహ్నం ఒంటి గంటకు వేలం జరుపనున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు తలనీలాల సేకరణకు రూ.3 లక్షలు, వాహనాలకు బొట్లు పెట్టేందుకు రూ.2 లక్షలు, కొబ్బరి చిప్పలు, ఒడిబియ్యం, చీరల సేకరణకు రూ.లక్ష చొప్పున డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. టీజీవీబీ, రామగిరి, నల్లగొండ బ్రాంచ్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా వెయ్యి రూపాయల చొప్పున డీడీలు తీయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. లేదా నగదును కూడా చెల్లించవచ్చని స్పష్టం చేశారు. ఆసక్తిగల వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

18న కట్టంగూర్ పశువుల సంత వేలం

కట్టంగూర్, మార్చి 15 : కట్టంగూర్ పశువుల సంత, తైబజారు వేలాన్ని ఈ నెల18న స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పెరుమాళ్ల జ్ఞానప్రకాశ్‌రావు, పంచాయతీ కార్యదర్శి వడ్లకొండ అశోక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు తాసీల్దార్‌తో డ్రువీకరించిన రూ.5లక్షల సాల్వెన్సీ సర్టిఫికెట్‌తో పాటు పశువుల సంతకు రూ.2 లక్షలు, తైబజారుకు రూ.లక్ష చొప్పున డీడీ తీసి 17వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు పంచాయతీ కార్యాలయంలో అందించాలని పేర్కొన్నారు.

ఎలుగుబంటి సంచారంపై అప్రమత్తంగా ఉండాలి

● ఎఫ్ఆర్ఓ భాస్కర్

చందంపేట, మార్చి 15 : చందంపేట మండలంలోని పొగిళ్ల గ్రామంలో గురువారం రాత్రి సమయంలో ఎలుగుబంటి సంచరించినట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో అప్రమత్తమై గాలింపు చేపడుతున్నట్లు ఎఫ్ఆర్ఓ భాస్కర్ తెలిపారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఎలుగుబంటి జాడ కోసం బీట్ ఆఫీసర్లు ఇప్పటికే గాలిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు రాత్రి సమయంలో ఒంటరిగా వెళ్లకూడదని, ఎలుగుబంటి కనిపిస్తే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. వేసవి కావడంతో దాహార్తి తీర్చుకోవడం కోసం అటవీ ప్రాంతం వీడి అది బయటికి రావచ్చని అనుమానం వ్యక్తం చేశారు.

తోలు ఉత్పత్తి దారులను ప్రభుత్వం ఆదుకోవాలి

మర్రిగూడ(నాంపల్లి) : తోలు ఉత్పత్తిదారుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని చిట్టంపహాడ్‌లో తోళ్ల తయారీ పరిశ్రమను వారు పరిశీలించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం స్పందించి వారికి వనరులను సమకూర్చి ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.5 లక్షలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నాంపల్లి చంద్రమౌళి, నాయకులు ఏర్పుల యాదయ్య, కొమ్ము లక్ష్మయ్య, రాఘవాచారి, కృష్ణ, సాయిలు, ముత్తయ్య, ప్రసాద్, శ్రీను, రాములు, బజారు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి మాజీ ఎమ్మెల్యే భగత్ పరామర్శ

నిడమనూరు, మార్చి 15 : నిడమనూరు మండలం ఇండ్లకోటయ్యగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు నార్ల రామకృష్ణను శనివారం సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ పరామర్శించారు. రామకృష్ణ కుమారుడు నార్ల ప్రశాంత్ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలిసిన మాజీ ఎమ్మెల్యే శనివారం గ్రామంలోని రామకృష్ణ ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. నార్ల ప్రశాంత్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటి సత్యపాల్, బొల్లం సైదులు, మార్కెట్ వైస్ చైర్మన్ రామలింగయ్య, మాజీ సర్పంచ్ రవి, నాయకులు బైరెడ్డి సత్యనారాయణ, మండలి రవి, గడ్డం సత్యనారాయణ, యుగేంధర్‌రెడ్డి, పిల్లి రాజు, బొమ్ము శివ, శ్రవణ్, వర్మ ఉన్నారు.

ప్రశాంత్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్

పన్ను కట్టలేదని.. ఇల్లు సీజ్

హాలియా, మార్చి 15 : హాలియాకు చెందిన వ్యక్తి పన్ను కట్టలేదని అతడి ఇంటిని మున్సిపల్ అధికారులు శనివారం సీజ్ చేశారు. హాలియా మున్సిపాలిటీలోని 4వ వార్డుకు చెందిన జాజం వెంకటేశ్వర్లు ఇంటికి సంబంధించి రెండేండ్ల ఇంటి పన్ను రూ.84,750 చెల్లించాల్సి ఉంది. పన్ను చెల్లించాలని కోరుతూ మున్సిపాలిటీ అధికారులు 15 రోజుల క్రితం అతడికి రెడ్‌కార్నర్ నోటీసు జారీ చేశారు. అయినా అతను చెల్లించక పోవడంతో మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు సిబ్బంది శనివారం జాజం వెంటేశ్వర్లుకు సంబంధించిన షట్టర్లకు తాళం వేసి సీజ్ చేశారు. అయితే తాను ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఇంటి పన్ను కట్టలేదని, తర్వాత కడతానన్నా వినకుండా మున్సిపల్ సిబ్బంది తాళం వేశారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

హాలియాలో ఇంటిని సీజ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మిర్యాలగూడలో..

మిర్యాలగూడటౌన్ : మున్సిపల్ కమిషనర్ ఎండీ.యూసుఫ్ శనివారం పట్టణంలోని పలు పెట్రోల్ బంకులు, కాంప్లెక్స్‌లపై దాడులు నిర్వహించారు. హనుమాన్‌పేట బైపాస్‌లో ఉన్న రిలయన్స్ పెట్రోల్ బంక్ యాజమాన్యం మూడు సంవత్సరాలుగా రూ.1.42 లక్షల పన్ను బకాయి ఉండగా నోటీసులు ఇచ్చినా స్పందించక పోవడంతో దానిని సీజ్ చేసినట్లు తెలిపారు. సాగర్‌రోడ్డులోని ఎస్ బీఐ కాంప్లెక్స్‌లో 15 షాపులు, 3 బ్యాంకులు, హాస్టల్, కాలేజీ, స్కిల్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ నడుపుతున్నారని, వారు రూ.13.23 లక్షలు బకాయి ఉండగా రెడ్ నోటీసు జారీ చేసినట్లు పేర్కొన్నారు. సోమవారం వరకు పన్ను చెల్లించకుంటే కాంప్లెక్స్ మొత్తాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాలియా, మార్చి 15 : అనుముల మండలంలోని హాజారిగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో 33 కేవీ విద్యుత్ లైన్ మెయింటెనెన్స్ పనులు చేపడుతున్నందున ఆదివారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ ధన్‌రాజ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మండలంలోని హాజారిగూడెం, నాయుడుపాలెం, చల్మారెడ్డిగూడెం, కొట్టాల, అలీనగర్ గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

మిర్యాలగూడలో

మిర్యాలగూడ : పట్టణంలోని 33/11కేవీ సబ్‌స్టేషన్ నుంచి వచ్చే డాక్టర్స్ కాలనీ ఫీడర్ కింద లైన్ మరమ్మతు పనులు జరుగుతున్నందున ఆదివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో టూటౌన్ ఏఈ ఎన్.రవీందర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని రాఘవ థియేటర్ నుంచి మోర్ సూపర్ మార్కెట్ వరకు, రెడ్డికాలనీలోని రామాలయం, ముత్తిరెడ్డికుంటలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు పేర్కొన్నారు.

ఆస్తి పన్ను చెల్లింపుదారులకు వడ్డీ రాయితీ ఇవ్వాలి : సీపీఎం

మిర్యాలగూడ, మార్చి 15: మున్సిపాల్టీలో ఆస్తి పన్నులు బకాయి ఉన్న వారికి వడ్డీ రాయితీ ఇవ్వాలని మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ డబ్బికార్ మల్లేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఏడాది మార్చిలో ఆస్తి పన్ను వసూలను వేగవంతం చేసే సమయంలో వడ్డీ రాయితీ ఇస్తూ పేద, మధ్య తరగతి ప్రజలకు వెసులుబాటు కల్పిస్తుందన్నారు. కానీ ప్రస్తుతం వడ్డీ రాయితీ ఇవ్వకుండా ఆస్తి పన్ను కోసం మున్సిపల్ అధికారులు ప్రజలను బలవంతం చేస్తున్నారన్నారు. ఆస్తి పన్నుపై వడ్డీలో 90శాతం రాయితీ ఇచ్చినట్లయితే ఎక్కువ మంది ప్రజలు పన్ను చెల్లించేందుకు అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో నాయకులు రవినాయక్, మల్లు గౌతంరెడ్డి, పరుశురాములు, తిరుపతి రామ్మూర్తి, లక్ష్మీనారాయణ, బాషా పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డబ్బికార్ మల్లేశ్

పేదలకు ఇండ్ల పట్టాలు పంపిణీ చేయాలి

మర్రిగూడ, మార్చి 15 : మండలంలోని ఇందుర్తి గ్రామంలో ప్రభుత్వం సేకరించిన 3 ఎకరాల భూమిలో పేదలకు ఇండ్ల స్థలాలను కేటాయించి పట్టాలను పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున కోరారు. శనివారం ఈ మేరకు తాసీల్దార్ బక్క శ్రీనివాసులుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని అలానే వదిలేస్తే అన్యాక్రాంతమయ్యే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. పేదలకు ఇండ్ల స్థలాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24, 25, 26 తేదీల్లో తాసీల్దార్ కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఏర్పుల యాదయ్య, నాయకులు నీలకంఠం రాములు, రామలింగాచారి, దామెర లక్ష్మీ, రాఘవేంద్ర, యాదగిరిరెడ్డి, సుగుణమ్మ పాల్గొన్నారు.

తాసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలి :ఎంపీడీఓ

అడవిదేవులపల్లి, మార్చి15: వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు రాకుండా అధికారులు ముందస్తు చర్యలు చేసుకోవాలని ఎంపీడీఓ ఎం.రమేశ్ ఆదేశించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవిలో గ్రామాల్లో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ఉపాధిహామీ పథకం పనుల నిర్వహణ, నర్సరీల నిర్వహణ, పారిశుద్ధ్యం కార్యక్రమాలపై శ్రద్ధ వహించాలన్నారు. ఎంపీఓ మోసిన్‌బిన్ అహ్మద్, ఏపీఓ సూరానాయక్ పాల్గొన్నారు.

విజేతలతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

ముగిసిన పోలీస్ స్పోర్ట్స్ అండ్స్ గేమ్స్ మీట్

నీలగిరి, మార్చి15 : మూడు రోజులుగా జిల్లా కేంద్రంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ శనివారం ముగిసింది. అనంతరం జిల్లా పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో విజేతలకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పోలీస్‌శాఖ అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సీనియర్ సిటిజన్స్ కోసం రాష్ట్రంలోనే తొలిసారిగా జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి గ్రీవెన్స్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఇందుకు కృషి చేసిన జిల్లా యంత్రాంగానికి ప్రభుత్వం తరుపున కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్రపవార్‌తో కలిసి వివిధ ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో డీఎస్పీలు రమేశ్, కొలను శివరాంరెడ్డి, రాజశేఖర్‌రాజు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

చదువులో వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ

● డీఈఓ భిక్షపతి

హాలియా, మార్చి 15 : ప్రభుత్వ పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థుల్లో విద్యాప్రమాణాలు పెంచేందుకు ఆధునిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి బొల్లారం భిక్షపతి అన్నారు. శనివారం అనుముల మండలం కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏఐ ఏఎక్స్ఎల్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో ఎంపిక చేసిన 14 ప్రాథమిక పాఠశాలల్లో 3,4,5 తరగతుల్లో కనీస అభ్యాసన సామర్థ్యంలో వెనుకబడిన విద్యార్థుల కోసం ఇంటిగ్రేటెడ్ టెక్నాలజీతో కూడిన కృత్రిమ మేధను వినియోగిస్తూ ఏఎక్స్ఎల్ ల్యాబ్‌ల ద్వారా వారి సామర్థ్యాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ ప్రక్రియపై ఇప్పటికే హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు శిక్షణ కూడా ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి రామచంద్రయ్య, హైస్కూల్ హెచ్ఎం దాస వెంకన్న,

ప్రాథమిక పాఠశాల హెచ్ఎం నిర్మల, పాయింట్ టీచర్ సరిత, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏఎక్స్ఎల్ ల్యాబ్‌ను ప్రారంభించి సూచనలిస్తున్న డీఈఓ భిక్షపతి

క్రమశిక్షణతో కూడిన విద్య ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది

● కృష్ణవేణి పాఠశాల డైరెక్టర్ నర్సిరెడ్డి

నకిరేకల్, మార్చి 15 : క్రమశిక్షణతో కూడి